జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు వెంటనే ఎత్తివేయాలి

**- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా నేరంగా పరిగణిస్తే ఎలా అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య ప్రశ్నించారు. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై షాద్‌నగర్ పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన న్యాయం జరగకపోగా, పాలక ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా జీవోలు తీసుకొచ్చి అమలు చేయాలని ప్రయత్నించినప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడం సహజమన్నారు. ప్రతి నిరసన కార్యక్రమానికి ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలంటే ఉద్యమాలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. ఉద్యమ పరిస్థితులు, ప్రజల సమస్యలను బట్టి పోరాట కార్యాచరణ నిర్ణయించుకుంటారని తెలిపారు. జీవో నంబర్ 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులు నిరసన చేపడుతుండగా, వారికి మద్దతుగా ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాశ్ నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకుడు శ్రీకాంత్, బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొనడాన్ని తప్పుగా పరిగణించడం సరికాదన్నారు. షాద్‌నగర్-- హైదరాబాద్ ప్రధాన రహదారిపై లింగారెడ్డిగూడ చౌరస్తా వద్ద విద్యార్థులు తమ సమస్యలపై పోరాటం చేస్తుంటే వారికి మద్దతు తెలిపిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల్లో పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా ఉండవచ్చని, వారి భవిష్యత్తుపై పోలీసులకు అవగాహన ఉండాలని అన్నారు. జీవో నంబర్ 97 పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా మారితే దాన్ని వెంటనే రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోలీసులు లేఖ రాయాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు చేస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని, వెంటనే కేసులను ఎత్తివేయాలని సీపీఐ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు బుద్ధుల జంగయ్య తెలిపారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో సీపీఐ ఆధ్వర్యంలో కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందుకు షాద్‌నగర్ పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జటావత్ హుస్సేన్ నాయక్ ను కలిసి సిద్దాపూర్ డంపింగ్ యార్డు పై పిర్యాదు.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం, సిద్దాపూర్ గ్రామ పరిసర ప్రాంతాలలో 86 ఎకరాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డ్‌ను +.వా. చీ. 641 ద్వారా రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ.. సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సబ్యులు జటావత్ హుస్సేన్ నాయక్ ను కలిసి వినతి పత్రం అందజేసిన గిరిజన సర్పంచులు నాయకులు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ సిద్దాపూర్ గ్రామ పంచాయతీ తండాకు కేవలం 300 మీటర్ల దూరంలో ఈ డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం వల్ల గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, చిన్న పిల్లలు మరియు పాడి పశువులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది అన్నారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే కలుషిత వ్యర్థజలాలు సమీపంలోని చెరువులు, నీటి ప్రవాహాల్లోకి చేరి కోళ్లపడకల చెరువు -- కల్వకోల్ చెరువు -- పాలమాకుల చెరువు -- హిమాయత్ సాగర్ వరకు చేరే ప్రమాదం ఉంది. హిమాయత్ సాగర్ హైదరాబాద్ నగరానికి ప్రధాన తాగునీటి వనరుల్లో ఒకటి కావడంతో, దీని కాలుష్యం ప్రజల తాగునీటిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. డంపింగ్ యార్డ్‌కు 10కిలోమీటర్ల పరిధిలో సుమారు 30000ఎకరాల విస్తీర్ణంలో పచ్చటి పంట పొలాలు ఉన్నాయి. అనేక మంది సన్నకారు, చిన్నకారు రైతులు వ్యవసాయం మరియు పాడి పశు వులపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 150--200 క్వింటాళ్ల కూరగాయలు మరియు 25,000 లీటర్ల స్వచ్ఛమైన పాలను హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్నట్లు కమిషన్ సభ్యులకు తెలిపారు . ప్రార్థనా మరియు ఆధ్యాత్మిక ప్రదేశాలకు సమీపం లో ఈ డంపింగ్ యార్డు వస్తున్నట్లు తెలిపారు.

ఇలాంటి పవిత్ర ప్రదేశాలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసన, ఈగలు, దోమలు మరియు ఇతర సమస్యల కారణంగా భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాసం ఉంది.

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 20కి.మీ. దూరంలో, ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్ -- కాన్హా శాంతివనం సుమారు 9 కి.మీ. దూరంలో ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ సమస్యలు మరియు దుర్వాసన కారణంగా సందర్శకులకు ఇబ్బందులు కలగవచ్చు. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల నివసిస్తున్న లంబాడి ,(గిరిజన) ప్రజలు, రైతులు, పిల్లలు మరియు వృద్ధులు కలిపి సుమారు 20000 మంది ఉన్నారు.

అదేవిధంగా General/BC/SC వర్గాలకు చెందిన ప్రజలు, రైతులు, పిల్లలు మరియు వృద్ధులు కలిపి సుమారు 40,000 మంది నివసిస్తున్నారు.

చెత్త కుళ్లిపోవడం వల్ల మీథేన్ వంటి వాయువులు, చెత్తకు మంటలు అంటుకోవడం వల్ల ఇతర హానికర వాయువులు విడుదలయ్యే ప్రమాదం ఉంది. దీని వల్ల ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు, లీచేట్ భూమిలోకి ఇంకిపోవడం వల్ల సమీపంలోని చెరువులు, నీటికుంటలు మరియు బోరు బావుల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్, రసాయనాలు మరియు ఇతర వ్యర్థాలు సమీప వ్యవసాయ భూముల్లోకి చేరితే నేల సారం, పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. దుర్వాసన, ఈగలు మరియు దోమల బెడద వల్ల సమీపంలోని పవిత్ర ప్రదేశాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగవచ్చు.

పశువులు మరియు వన్యప్రాణులకు ముప్పు: వ్యర్థాల్లోని ప్లాస్టిక్ మరియు విషపూరిత పదార్థాలను పశువులు లేదా స్థానిక వన్యప్రాణులు తినడం వల్ల వాటి ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

పై పరిస్థితులను పరిశీలిస్తే, ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల మా గ్రామాలు మరియు పరిసర ప్రాంతాలు నివాసయోగ్యతను కోల్పోయే ప్రమాదం ఉంది. కావున ప్రజల ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యత, రైతుల సంక్షేమం, పాడి పశువుల రక్షణ మరియు చిన్న పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, +.వా. చీ. 641ను తక్షణమే రద్దు చేసి, ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను జనవాసాలకు, వ్యవసాయ భూములకు మరియు పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలకు దూరంగా వేరే ప్రాంతానికి తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యుల ను కోరారు.

ఈ కార్యక్రమంలో వి బాసు, పి గోవింద్, రాంచందర్, పి రమేష్ , రఘురాం నాయక్, అశోక్ నాయక్, నగేష్ నాయక్ , రవి నాయక్ , నార్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పోమాల్‌పల్లిలో శిలా ఫలకం ధ్వంసం..!

**-రెండు రోజుల క్రితం కూల్చివేత..**
**-"బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం - దొరికితే వదలమంటూ హెచ్చరికలు"**
**-ఓ వాహనంలో ఎత్తివేసి పడేసిన వైనం..?**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** ఎమ్మెల్యేగా అంజయ్య యాదవ్ ఉన్న సమయంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు అభివృద్ధి పనులు పోమాల్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన కలకలం రేపుతోంది. రెండు రోజుల క్రితం పాత శిలాఫలకాన్ని కూల్చివేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అనంతరం ఓ వాహనంలో ధ్వంసమైన శిలాఫలకలను తరలించి బయట పడేసినట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. గతంలో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వై. అంజయ్య యాదవ్ ఉన్న సమయంలో గ్రామంలో సుమారు రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి అభివృద్ధి పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. అందుకు గుర్తుగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శిలాఫలకాన్ని కూల్చివేయడంపై కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. శిలాఫలకం ధ్వంసం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా? అనే చర్చ గ్రామంలో జరుగుతోంది. శిలాఫలకాన్ని ఎవరు ధ్వంసం చేశారు, ఎందుకు తొలగించారు? అనే విషయాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఘటనపై సంబంధిత అధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మరోవైపు శిలాఫలకం ధ్వంసంపై "బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం" చేస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన గుర్తులను ధ్వంసం చేయడం సరికాదని, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. శిలాఫలకం తొలగింపు వెనుక అసలు కారణాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని వారు పేర్కొన్నారు. అంజయ్య యాదవ్ ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసం చేసి తొలగించిన వాస్తవాలు వెలుగు చూశాక దీని కారణమైన వారిని భరిత పూజ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**-గచ్చిబౌలిలో గెట్ అండ్ ఫిట్ నూతన**
**-వ్యాయామశాల ప్రారంభం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** యువత తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నిత్య వ్యాయామం ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన నూతన వ్యాయామశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాల విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాయామాన్ని రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు. యువతకు ఉపయోగపడే విధంగా వ్యాయామశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాయామశాల నిర్వాహకులు అసిఫ్ తదితరులకు రవీందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాయామశాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు విఠల్, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ బండి రాజు, వ్యాయామశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మార్తాండ్ నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా-గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్ కాలనీ వాసులు కాలనీ లో నెలకొన్నా పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఆరెకపూడి గాంధీ ని వివేకానంద నగర్ లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా మార్తాండ్ నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ మా కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేశారు అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, మీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని , కాలనీ లో మంచి నీటి సరఫరా ను మెరుగుపర్చాలని , అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడి పనులు పూర్తి చేయాలని పియేసి చైర్మన్ గాంధీ కి వినతిపత్రం ద్వారా తెలియచేయడం జరిగినది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మార్తాండ్ నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని, మార్తాండ్ నగర్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, మార్తాండ్ నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు సహా య సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, కాలనీ లో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు జరుగుతుండటం వలన మంచి నీటి పైప్ లైన్ పనులు పునరుద్ధరిస్తామని, మెరుగైన మంచి నీటి సరఫరా వ్యవస్థను అందిస్తామని, మంచి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను తెలియచేశారు. అదేవిదంగా అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని, మార్తాండ్ నగర్ కాలనీ, మరియు కొండాపూర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామని తెలియచేశారు .ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ ముదిరాజు, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, భగత్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కప్పపహాడ్‌లో ఘనంగా శ్రీ పెద్దమ్మ బోనాల పండుగ



**ఇబ్రహీంపట్నం ( ఆగస్టు 24) జర్నలిస్ట్ డైరీ.** కప్పపహాడ్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పెద్దమ్మ బోనాల పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపు మహోత్సవంలో గ్రామ సర్పంచ్ బింగి గీత –రాములయ్య, బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్ పాల్గొన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు, మాజీ ఉప సర్పంచ్ కాగు యాదగిరి, బుట్టి సంజీవ, బుట్టి దర్శన్, ఆలం సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు. మండల ముదిరాజ్ నాయకులు బుట్టి శివకుమార్, కాగు వీరస్వామి, సోషల్ మీడియా నాయకులు బుట్టి శివ, ఆలం శివకుమార్, కె. సతీష్, కాగు ప్రవీణ్, శ్రీరామ్, బుట్టి మహేష్, చంటి, అఖిల్, శ్రీశైలం, దొంత్రోమోణి శివతో పాటు గ్రామ వార్డు సభ్యులు, ముదిరాజ్ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి పారవశ్యం నెలకొనగా, బోనాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గుర్రంపోడు మండల ఉపసర్పంచ్‌ల ఫోరం కార్యదర్శిగా అందుగుల గణేష్ ఏకగ్రీవ ఎన్నిక



**గుర్రంపోడు, ఆగస్టు 24: (జర్నలిస్ట్ డైరీ) :** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని సుల్తాన్‌పురం గ్రామ ఉపసర్పంచ్ అందుగుల గణేష్‌ను మండల ఉపసర్పంచ్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు ప్రకటించారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచ్‌లు ఏకతాటిపైకి వచ్చి ఈ ఎన్నికను పూర్తి చేశారు.ఈ సందర్భంగా నూతన కార్యదర్శి అందుగుల గణేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మండలంలోని ఉపసర్పంచ్‌లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి, ఉపసర్పంచ్‌ల హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో సమన్వయం చేసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. మండల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌ల పాత్రను మరింత బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సుల్తాన్‌పురం గ్రామ ప్రజలతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సర్పంచ్ వాడపల్లి వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**గుర్రంపోడు, ఆగస్టు 24: (జర్నలిస్ట్ డైరీ) :**



గుర్రంపోడు మండల పరిధిలోని ఎల్లమోనిగూడెం గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామ సర్పంచ్ వాడపల్లి వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న నిరుపేదలందరికీ సకాలంలో అందేలా చూడటమే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. డిజిటల్ సేవలలో భాగంగా అందిస్తున్న ఈ స్మార్ట్ కార్డులు లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పంపిణీ మహోత్సవంలో ఉప సర్పంచ్ కూర కవిత వెంకటయ్యతో పాటు వార్డు సభ్యులు కూర బాలరాజు, వాడపల్లి కృష్ణవేణి, కటికం లక్ష్మయ్య, చెన్నవోని అంజయ్య, కేశవుని సురేందర్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామానికి చెందిన మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా సర్పంచ్‌కు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మర్రిగూడలో ఘనంగా సీతాలమ్మ దేవాలయ వార్షికోత్సవ కరపత్ర ఆవిష్కరణ

**మునుగోడు ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :**



మర్రిగూడ మండల కేంద్రంలోని రజకుల ఆరాధ్య దైవం శ్రీ మడివాల మాచిదేవుడు సీతాలమ్మ దేవాలయ నాలుగవ వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని సోమవారం దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే సెప్టెంబర్ 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నూతనంగా శివలింగం, గణపతి, మరియు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పగడాల లింగయ్య, వెంకటంపేట బాలయ్య, కొడుకులపల్లి యాదయ్య మరియు రజక సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చైతన్యపురి డివిజన్ మారుతినగర్‌లో ఘనంగా బోనాల తొట్టెల వేడుకలు



**చైతన్య పురి ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** బోనాల పండుగ నేపథ్యంలో చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతినగర్ నందు జరిగిన తొట్టెల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు. ఇట్టి కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,నిఖిల్, సాయి,జలంధర్,పులి కిరణ్,నవీన్,శ్రావణ్,రాజు తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్ బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పై కేసు

**-ఏఐఎస్ఎఫ్ నేత ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ నేత శ్రీకాంత్ లపై కూడా కేసు**

**-అనుమతి లేకుండా ధర్నా చేపట్టినందుకు.. కేసు నమోదు**

**-జీఓ నంబర్ 97ను వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టడంపై పోలీసుల ఆక్షేపణ**

**-ఏఎస్ఐ గోపాల్ ఫిర్యాదుతో తో కేసు నమోదు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నా నిర్వహించి ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారనే ఆరోపణలపై షాద్‌నగర్ పోలీసులు బిజెపి నాయకుడితో సహా ఇద్దరు విద్యార్థి సంఘాల నాయకులపై ఏఎస్ఐ గోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం సమీపంలోని పాత ఎన్‌హెచ్-7 రహదారిపై కొందరు ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలకు చెందినవారు, బీజేపీకి చెందిన కొందరు వ్యక్తులు గుమిగూడి ధర్నా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారనీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పథకంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలో విలీనం చేయడం, సాంకేతిక విద్యా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన జీఓ నంబర్ 97ను వ్యతిరేకిస్తూ ఈ ధర్నా నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే ధర్నా నిర్వహించేందుకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, రోడ్డుపై నిరసన కారణంగా సాధారణ ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని పోలీసులు పేర్కొన్నారు. నిరసనకారులు రోడ్డుపై కూర్చొని నినాదాలు చేస్తూ ధర్నా కొనసాగించినట్లు ఫిర్యాదులో తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలకు చెందిన ఆకాష్ నాయక్, శ్రీకాంత్‌తో పాటు బీజేపీకి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మరియు అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 731/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 223, 126(2) ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ ఆర్. ప్రణయ్ కుమార్‌కు అప్పగించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు ఆలస్యంగా ఈ అంశం మీడియాకు వెలుగు చూసింది.

# ఆమనగల్లులో మండల స్థాయి ప్రజావాణికి 40 వినతులు

**ఆమనగల్లు, ఆగస్టు24 (జర్నలిస్ట్ డైరీ) :** ఆమనగల్లు మండలంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఎంపీడీవో విజయ్ రామ్, తహసీల్దార్ ఫహీం ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అధికారులకు తమ వినతులను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 40 వినతులను అధికారులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి15 వినతులు,మున్సిపల్ కు 6, హౌసింగ్ 16, ట్రైబల్ శాఖకు1, ఆర్టీసీ శాఖకు1, ఐసీడీఎస్ శాఖకు 1 వినతి చొప్పున ప్రజలు సమర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి,నిబంధనల ప్రకారం పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు,వివిధ శాఖల సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో విజయ్ రామ్,తహసీల్దార్ ఫహీం ఖాద్రీ,మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.




# ఇబ్రహీం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు

**- నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**రామన్నపేట ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) :** పాత్రికేయ రంగానికి సీనియర్ జర్నలిస్టు ఎండి ఇబ్రహీం మృతి తీరనిలోటు అని నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. సోమవారం రామన్నపేట పాత్రికేయ బృందవ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇబ్రహీం సంతాప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు పాత్రికేయ రంగంలో 50 సంవత్సరాలు పైగా ఒకే పత్రికలో పనిచేసిన గొప్ప వ్యక్తి ఎంపీ ఇబ్రహీం అని కొనియాడారు. ఎవరితోనూ విభేదాలు లేకుండా అందర్నీ కలుపుగోలుగా కలుపుకొని అందరి మండల లో పొందిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని అన్నారు. 2018 నుండి తనకు ఎంతో సానిహితంగా ఉంటూ ఎప్పటికప్పుడు తనతో మాట్లాడుతూ పలు సమస్యలపై చర్చించేవారు అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు.



సీనియర్ పాత్రికేయ రంగంలో ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తు పాత్రికేయ రంగంలో నిబద్ధత కలిగిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని కొనియాడారు. ఆయన మృతి ప్రతి ఒక్కరికి తీరనిలోటని ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పున్న జగన్మోహన్,సిరిగి రెడ్డి మల్లారెడ్డి, ఎండి జమీరుద్దీన్, గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్, పోచబోయిన మల్లేశం, ఉట్కూరి నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, వనం చంద్ర శేఖర్, మీర్జా ఫజల్ బేగ్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి రెహాన్, ఎండి అక్రమ్, మిర్యాల మల్లేశం, సాల్వేర్ అశోక్, కందుల హనుమంతు, మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

